



జిసిసి చైర్‌పర్సన్‌గా స్వాతీరాణి కొనసాగింపు

ప్రజాశక్తి - సాలూరు



జిసిసి చైర్‌పర్సన్‌గా డాక్టర్ శోభా స్వాతీరాణి మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 48 కార్పొరేషన్లకు చైర్మన్ల పునర్నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వాతీరాణి రెండో సారి జిసిసి చైర్‌పర్సన్‌గా నియామకమయ్యారు. గిరిజనుల నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, అరుకు కాఫీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, జిసిసి ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంలో చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతీరాణి కృషి చేశారు. ఆమె సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ చైర్‌పర్సన్‌గా నియమించింది.

ప్రతి వారం పాఠశాలల సందర్శన

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

మై స్కూల్ - మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా దత్తత అధికారులు ప్రతి వారం పాఠశాలలను సందర్శించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల దత్తత అధికారులు పాఠశాలను విధిగా సందర్శించాలన్నారు. విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించాలని, ఆయా అంశాల్లో విద్యార్థులు బలోపేతం కావాలని సూచించారు. నోట్, వర్క్ పుస్తకాలను ఉపాధ్యాయులు తనిఖీ చేసినదీ, లేనిదీ విధిగా పరిశీలించాలని ఆదేశించారు. ఈనెల 24న విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షను నిర్వహించి వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యత పరిశీలించాలని, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రక్తహీనత నివారణకు ఐసిడిఎస్ సిబ్బంది చర్యలు చేపట్టాలని చెప్పారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దత్తత అధికారులు వారంలో రెండుసార్లు విధిగా సందర్శించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కిట్లు వస్తున్నాయని వాటిని తీసుకోవాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ పనులు, గృహ నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. పిఎం జన్‌మాన్ (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్) కింద పివిటిజిలకు శత శాతం గృహాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో 9825 కుటుంబాలకు అవసరమున్నట్లు ప్రాథమిక అంచనా అన్నారు. ఈనెల 31 నాటికి సర్వేను ఇంజినీరింగ్ సహాయకులు పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా చేయాలన్నారు. ప్రాధాన్యత పనులు త్వరగా అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన ఫారం 6,7,8 దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఓటరు నమోదు అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు రశీదులు జాప్యం ఉండరాదు

మిల్లుల వద్ద రశీదులు జాప్యం (అకనాలెడ్జిమెంట్లు పెండింగ్) ఉండరాదని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 59 మిల్లుల వద్ద 6440 మెట్రిక్ టన్నులకు సంబంధించి రశీదులు జాప్యం ఉన్నట్లు సమాచారం ఉందని, తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఏ మిల్లు వద్ద మూడు గంటలకు మించి జాప్యం లేకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. జాప్యం వల్ల ట్రక్ షీట్ జారీ సైతం జాప్యం జరుగుతుందని గమనించాలని ఆయన చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

26 నుంచి ఆడుదాం ఆంధ్రా

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఈ నెల 26 నుండి ప్రారంభమవుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులకు తెలియజేసి ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చేయాలని, పోటీలను విజయవంతం చేయాలని కోరారు. క్రీడా పరికరాలు పంపిణీ జరుగుతున్నాయని, 193 మైదానాలు గుర్తించగా, ఇప్పటి వరకు 125 సిద్ధం చేశామని, మిగిలినవి వెంటనే సిద్ధం చేయాలని అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను బాడ్మింటన్, క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో 15ఏళ్లపైబడిన మహిళా, పురుషుల విభాగాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకట రావు, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవ నాయుడు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్
- ముగిసిన జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తున్నా విద్యాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు జిల్లాలో లేకపోవడం చాలా అన్యాయమని, ఆ దిశగా పాలక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రయత్నించకపోవడం దౌర్భాగ్యమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ అన్నారు. పాలకొండలో రెండు రోజుల పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు మంగళవారం ప్రతినిధుల సభతో ముగిసింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, పార్వతీపురం మన్యం జిల్లాలు బాగా వెనుకబడిన ప్రాంతాలని, ఇటువంటి ప్రాంతాలు విద్యాభివృద్ధితోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయగలవని అన్నారు. కావున వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ మాజీ సీనియర్ నాయకులు రెడ్డి వేణు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి. రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌య ఊనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. రేపటి భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, విద్య కాషాయకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరింత ఉధతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు రాజు, పండు





మహాసభ సందర్భంగా 15 మందితో జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు, ఉపాధ్యక్షులుగా ఎ.గంగారాం, సహాయ కార్యదర్శిగా అఖిల్, గర్ల్స్ కన్వీనర్‌గా శారద, కోశాధికారిగా హెచ్.సింహాచలంతో పాటు తొమ్మిది మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

తీర్మానాలు

◆ జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి ◆ పార్వతీపురంలో మెడికల్, ఐ.టి.ఐ, పిజి, సాలూరులో బిఇడి, పాలకొండలో పిజి, గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాలలు నిర్మించాలి ◆ కురుపాంలో ఇంజనీరింగ్ కళాశాల భవనం త్వరితగా పనులు పూర్తి చేయాలి ◆ గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు నిర్మించాలి ◆ బలిజిపేట, కురుపాం, బామిని, పాచిపెంట మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు నిర్మించాలి ◆ వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి ◆ పాలకొండ డివిజన్ కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి ◆ గిరిజన పోస్ట్ మెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టలుకు సొంత భవనం నిర్మించాలి ◆ డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలి ◆ సాలూరు పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలి ◆ సీతంపేట పాలిటెక్నికల్ విద్యార్థులకు సొంత హాస్టల్ ఏర్పాటు చేయాలి ◆ సంక్షేమ హాస్టల్‌కు బకాయిలుగా నిలిచిన మెస్ బిల్లులు విడుదల చేయాలి ◆ ఉపాధ్యాయులపై యాప్ విధాన నిబంధనలను రద్దు చేయాలి ◆ 117 జిఒను రద్దు చేసి, పాఠశాలల విలీనం ఆపాలి.

తగ్గేదే లే...

- ఉధృతమవుతున్న అంగన్‌వాడీల ఆందోళన
- నిరసన దీక్షల వద్ద వంటా వార్పు
- దున్నపోతుకు వినతులు అందజేత



కొమరాడలో దున్నపోతుకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు



పార్వతీపురంలో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

అంగన్‌వాడీలకు సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 12న తలపెట్టిన నిరవధిక సమ్మె మరింత ఉధృతమవుతోంది. 8వ రోజుకు సమ్మెలో భాగంగా మంగళవారం శిబిరాల వద్ద వంటా వార్పు చేస్తూ నిరసన తెలిపారు. మరికొన్ని చోట్ల దున్నపోతుకు వినతిని అందజేస్తూ ఆందోళన చేపట్టారు.

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టర్ కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, వాకాడ ఇందిర, ప్రాజెక్టు లీడర్ మ(్రా)పు అలివేలు, సాలూరు గౌరీమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీరి పోరాటానికి గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల తలుపుల తాళాలు విరగ్గొట్టి, ప్రవేశాలు చేసిన వారికి ఎందుకు యాప్‌ల పద్ధతి అనుసరించలేదని ప్రశ్నించారు. చిన్నారులకు మూతీ, ముడ్డి ఎందుకు కడగట్లేదన్నారు. భవిష్యత్‌లో మున్సిపల్ వర్కర్స్ సమ్మె చేస్తే పట్టణంలోని చెత్త చెదరాలు ఎత్తుతారా, మరుగుదొడ్లు శుభ్రం చేస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కె.రాజేశ్వరి, ఎం.గౌరి, బి.సునీత, అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు అండగా ఉంటాం

రాష్ట్రవ్యాప్తంగా కనీస వేతనాల కోసం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు టిడిపి మద్దతు తెలుపుతుందని మాజీ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా అంగన్వాడీలు కొనసాగిస్తున్న 8వ రోజు నిరసన దీక్షా శిబిరానికి పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్రతో కలిసి హాజరైన ఆయన వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరల ప్రకారం కనీస వేతనాలు సాధారణ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న ఆందోళనలను గుర్తించి ముఖ్యమంత్రి సానుకూలంగా పరిశీలించాల్సింది పోయి, ఫ్యాక్షన్ మనస్థత్వంతో అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టి తెరవాలని ఉత్తర్వులు ఇవ్వడం ఆయన మనస్తత్వానికి అద్దం పడుతుందని అన్నారు. ఇప్పటికైనా వారి పోరాటాన్ని గుర్తించి సమస్యను పరిష్కరించి ఎప్పటిలాగా కేంద్రాలను వారు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ ప్రభుత్వం ముందుకు రాకపోతే అది కొద్ది రోజుల తర్వాత తాము అధికారం చేపట్టి సహితుకమైన వారి డిమాండ్లను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిడిపి పాల్గొన్నారు.

సాలూరు: ఇచ్చిన మాట తప్పితే మహిళా వచ్చే ఎన్నికల్లో తమ మహిళా శక్తి చూపిస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేస్తూ వంటావార్పు నిర్వహించారు. నిరసన శిబిరం వద్దనే వండుకుని మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షులు బలగ రాధ, మండల కమిటీ అధ్యక్షులు ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ టి.ఇందూ, యూనియన్ నాయకులు శ్యామల, కుమారి, తిరుపతమ్మ, పార్వతి పాల్గొన్నారు .

బలిజిపేట : వంటా వార్పుతో అంగన్వాడీలు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నిరసన తెలిపారు ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సత్యంనాయుడు, నల్ల ఈశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సమ్మెలో భాగంగా మంగళవారం ఎల్విన్‌పేట ప్రధాన రహదారి సమీపాన వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, ట్రెజరర్ మండంగి రమణ, మండల అధ్యక్షులు బిడ్డిక శంకరరావు, తదితరులు ఉన్నారు.

గురుగుబిల్లి : మండలంలో అంగన్వాడీలు వంటా, వార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. సమ్మె శిబిరం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు గౌరమ్మ, సావిత్రి తదితరులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొమరాడ : సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిని ఇస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద వంటావార్పు చేశారు. సమ్మెకు రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి వర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శ్రీనునాయుడు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కొమరాడ గ్రామ పెద్ద నీరస సత్యం మాస్టర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో కొమరాడ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సెక్టార్ లీడర్ బి.అలివేలు, జ్యోతి, పద్మ, జయమ్మ, మల్లేశ్వరమ్మ, కె.వరలక్ష్మి, ఎస్.రాధ, టిడిపి అరుకు పార్లమెంట్ రైతు సంఘం ఉపాధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ మండల నాయకులు నూకరాజు, పెద్దఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అక్కడే వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో వి.రామలక్ష్మి, సత్యవతి, యశోద, శైలజ, సునీత, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వై.రామారావు, ఆర్.ఈశ్వరరావు, ఆర్.లక్ష్మునాయుడు తో పాటు పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో అంగన్వాడీలు తలపెట్టిన సమ్మెలో భాగంగా వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, ప్రాజెక్ట్ అధ్యక్షులు రమాదేవి, నాయకులు టి.ప్రభావతి, బేగం, పైడ్రాజు, జయలక్ష్మి, ఇందిర, సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీలు స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు వంటా, వార్పు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి, కురుపాం, జియ్యమ్మ వలస మండలాల నుండి వందలాదిమంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీలు వంటా వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి హిమప్రభ మాట్లాడుతూ న్యాయమైన తమ కోర్కెలు తీర్చే వరకూ పోరాటం కొనసాగుతందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. స్థానిక ఐటిడిఎ ముఖ ద్వారం వద్ద అంగన్వాడీలు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ దీక్షలనుద్దేశించి యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, దర్శిమి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సురేష్, కాంతారావు, సిఐటియు నాయకులు ఎ.భాస్కరరావు, గిరిజన సంఘం నాయకులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



సీతంపేటలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి



గుమ్మలక్ష్మీపురంలో వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీలు



సాలూరులో వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీలు



బలిజిపేటలో వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీలు

నేడు యువగళం బహిరంగ సభ

- ముందే చేరుకున్న లోకేష్, కుటుంబ సభ్యులు
- ఏర్పాట్లును పరిశీలించిన టిడిపి, జనసేన నాయకులు
- 5లక్షల మంది వస్తారని అంచనా
- 600 మంది కూర్చునేందుకు వీలుగా వేదిక

ప్రజాశక్తి- భోగాపురం

టిడిపి యువనేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం-నవశకం పాదయాత్ర విజయోత్సవ సభ భోగాపురం మండలం పోలిపల్లి వద్ద గల భూమాతా లేఅవుట్‌లో బుధవారం జరగనుంది. ఈ సభకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సహా టిడిపి కీలక నేతలు, అన్ని నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జులు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. గత వారం రోజులుగా సభా వేదిక, బారికేడ్లు ఏర్పాటు చకా చకా జరిగాయి. గత రెండురోజులుగా టిడిపి ముఖ్య నాయకులంతా ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం, జనసేనకు చెందిన పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మంగళవారం సభా వేదిక వద్దకు వచ్చారు. నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మిణి, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఇప్పటికే చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, బుచ్చయ్య చౌదరి, అలాగే నాయకులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, పట్టాభి, బుద్దా వెంకన్న, చింతకాయల అయ్యన్న పాత్రుడు, పీతల సుజాత, దేవినేని ఉమా, కొల్లి రవీంద్ర, ఉగ్రనరసింహారెడ్డి, వర్ల రామయ్య, బాబు రాజేంద్రప్రసాద్ దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్ళేందుకు సిద్ధంగా ఉందని, మరో వంద రోజుల్లో టిడిపి అధికారంలోకి రానుందని అన్నారు. యువగళం సభ నిర్వహించేందుకు వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా ఆటంకాలు కలిగించిందన్నారు. సభా స్థలంతో పాటు, బస్సులు ఇచ్చేందుకు కూడా నిరాకరించిందని తెలిపారు. వైసిపిని ప్రజలు ఇంటికి సాగనంపేందుకు సిద్ధమయ్యారని అన్నారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కూడా హాజరవుతుండడంతో ఆ పార్టీకి చెందిన నాయకులు పంచకర్ల సందీప్, కోన తాతారావు, పాలవలస యశస్విని, పడాల అరుణ, లోకం మాధవి తదితరులు సభా ప్రాంగణం వద్దకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. సభకు 5లక్షల మంది వస్తారని అంచనా కాగా, సుమారు లక్షమందికి కూర్చొనేందుకు కుర్చీలు వేస్తున్నారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏరియాలను కూడా జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు.



నాయకులతో చర్చిస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ఇదే సమయం... ఇక కానిచ్చేద్దాం

ప్రజాశక్తి - మక్కువ

ఉన్నతాధికారుల ఆదేశాలుండాలే కానీ దాన్ని తమకు అనుకూలంగా ఎలా మార్చుకోవాలో విద్యుత్ శాఖ అధికారులకు ఉన్న తెలివితేటలు వేరొకరికి ఉండవని చెప్పడంలో అతిశయోక్తి కాదు. పార్వతీపురం ఆర్‌డిఇ ఇలా ఆదేశాలు ఇచ్చారో లేదో గానీ శంబర విద్యుత్తు లైనుకు సంబంధించిన పనులు చేపట్టారు. అయితే అధికారుల ఆదేశాలను తమకు ఆదాయం వచ్చే రీతిలో మరల్చుకుంటున్నారని విద్యుత్‌శాఖ సిబ్బందిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

మండల కేంద్రం నుంచి శంబరకు విద్యుత్ టు లైన్ వెళ్తోంది. ఓ ప్రైవేటు పాఠశాలకు ఆనుకొని ఉన్న అలాగే పక్కనే ఉన్న ఖాళీ స్థలానికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలను ఆర్ అండ్ బి రోడ్డు వైపు మార్చేస్తున్నారు. ఒక విద్యుత్ స్తంభం పాడైపోతే అదే స్థానంలో కొత్తగా స్తంభాన్ని వేయాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా సుమారు నాలుగు అడుగుల నుంచి ఏడు అడుగుల దూరం వరకు విద్యుత్తు లైనను మార్చడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల ఆదేశాలను పక్కన పెడితే విద్యుత్ ఉన్నతాధికారుల జేబులు నింపేందుకు ఎంతో ఉపయోగకరంగా మారాయి అన్నది ఈ స్తంభాల మార్పు తీరును చూస్తే అర్థమవుతుందని పలువురు చెబుతున్నారు. ఒక స్తంభాన్ని మార్చాలంటే ప్రభుత్వానికి షిఫ్టింగ్ ఛార్జీలు సంబంధిత వ్యక్తులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేకుండానే విద్యుత్ శాఖ చెందిన ఓ అధికారి సంబంధిత వ్యక్తులతో లాలూచీపడి ఈ మార్పులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలోని పలువురు రైతులు ట్రాన్స్‌ఫార్మర్ పాడైందని, మార్చమని పలుమార్లు విజ్ఞప్తి చేసినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదు. చేతులు తడిపే పనులు ఏకబిగిన చేస్తారన్న దానికి ప్రస్తుతం పై పనులే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపినట్టైతే వాస్తవాలు వెలుగు చూసే ఆస్కారం లేకపోలేదని పలువురు కోరుతున్నారు.

ఇదీ విద్యుత్ శాఖ పనుల తీరు



పక్కపక్కనే వేస్తున్న విద్యుత్ స్తంభాలు

ఎడిఇ ఆదేశానుసారమే..

ప్రస్తుతం మక్కువలో జరుగుతున్న విద్యుత్ స్తంభాల మార్పునకు సంబంధించి ఎడిఇ ఆదేశాల మేరకే పనులు జరుగుతున్నాయని మక్కువ లైన్మెన్ టి.సురేష్ తెలిపారు. శంబర వెళ్లే లైను సరి చేస్తున్నామన్నారు. పాత స్తంభాలు విద్యుత్ తీగలు వదులుగా ఉండడంతో అలా చేస్తున్నామని తెలిపారు.

మలుపు తిరుగుతున్న డీలక్స్ స్థల వివాదం

పన్ను కట్టించుకోవాలంటున్న కొనుగోలుదారులు
ట్రిబ్యునల్‌లో ఉందంటున్న దేవాదాయ అధికారి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణం నడిబొడ్డున ఉన్న వెంకటేశ్వరా డీలక్స్ స్థలం వివాదం మలుపులు తిరుగుతోంది. మున్సిపల్ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారయింది. ఈ స్థలం చుట్టూ వివాదాలు అల్లుకొని ఉండడంతో ఎటూ తేల్చుకోలేక అధికారులు సతమతమవుతున్నారు. 2020లో పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు సర్వే నెంబర్ 159/2లో ఉన్న 119.83, 100.70,815 చదరపు గజాల స్థలాలను కొనుగోలు చేశారు. స్థానిక జమిందార్ కుటుంబానికి చెందిన రాజేంద్ర మణిదేవి పేరున ఉన్న ఈ స్థలాలను పిబిఎస్ విక్రం చంద్ర సన్యాసి రాజు, పిబిఎస్ నారాయణ రాజుల పేర వారసత్వ సంపదగా మార్పు చేశారు. వీరి నుంచి ప్రయివేటు వ్యక్తులు కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2020లోనే కొనుగోలు చేసిన తమ ఆస్తికి పన్ను కొట్టించుకోవాలని ప్రయివేటు వ్యక్తులు కోరుతున్నారు. పన్ను కొట్టించుకోవాలని వారు హైకోర్టులో కేసు వేశారు. 8వారాల్లో విచారణ జరిపి పన్ను కొట్టించుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం కొద్ది రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ జయరాం కొనుగోలుదారులు, విక్రయదారులను పిలిచి విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మున్సిపాలిటీకి రావాల్సిన పన్ను బకాయిలపై అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయాలని భావిస్తున్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతభత్యాల పంపిణీ సక్రమంగా జరగాలంటే సాధారణ నిధి పుష్కలంగా ఉండాలి. సాధారణ నిధి ఖాళీ కావడంతో అధికారులు బకాయిలపై దృష్టి సారించారు. డీలక్స్ స్థలాలకు సంబంధించిన పన్నులు కొట్టించుకోవాలని కొనుగోలుదారులు మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే కొంతమంది అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని గతంలో పని చేసిన అధికారులు పట్టించుకోలేదు. కానీ ఇటీవల కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మున్సిపల్ అధికారులకు ఉంది. అయితే మంగళవారం దేవాదాయ శాఖ జిల్లా అధికారి మున్సిపల్ కమిషనర్‌కు ఓ లేఖ పంపించారు. సర్వే నెంబర్ 159/2లో ఉన్న డీలక్స్ స్థలం వివాదం ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో ఉన్నందున దానిపై ఎలాంటి మ్యుటేషన్ లు చేయవద్దని కోరారు. గతంలోనూ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ ఎసి ఈ స్థలంపై నివేదిక సమర్పించారు. ఈ స్థలం దేవాదాయ శాఖ దేనని ఎసి నివేదికలో పేర్కొన్నారు. అన్ని ఆధారాలతో కూడిన ధ్రువపత్రాలు తమ వద్ద ఉన్నాయని, పన్ను కొట్టించుకోవాలని కొనుగోలు దారులు కోరుతున్నారు. సుమారు 50ఏళ్లుగా జమిందారీ కుటుంబీకులు ఈ ఆస్తులపై మున్సిపాల్టీకి పన్ను కడుతున్నారని, మరి తమ వద్ద ఎందుకు కట్టించుకోవడంలేదని కొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కమిషనర్ జయరాంను వివరణ కోరగా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సలహా మేరకు ఈ విషయం లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



వివాదాస్పదమైన డీలక్స్ స్థలం



సాబ్జీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సాబ్జీ ఆశయ సాధనకు కృషి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సీతానగరం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ నివాళులర్పిస్తూ యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో సంతాప సభ జరిగింది. సంతాప సభకు అధ్యక్షత వహించిన మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు సరైన నివాళి అని అన్నారు. అనంతరం సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సాబ్జీ సేవలను స్మరిస్తూ ఆయన మృతి ఉపాధ్యాయ ఉద్యమ స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. ఆయన మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ప్రస్తావించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.గోవిందరావు, ఆర్.శంకర్ రావు, మండల కార్యవర్గ సభ్యులు ఎ.పోలినాయుడు, బి.ఆదినారాయణ, సిహెచ్.గణపతి, కె.మురళి, బలగ ప్రసాద్, ఎ.శంకర రావు, ఎస్.త్రినాధ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.రాజపురం పోలింగ్ కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంఇఒ. ఆర్.ఆనందరావు, హెడ్‌కానిస్టేబుల్ వాసు నాయుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితరమైనవి ఉన్నవీ లేనివీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.దేవరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంజీవనాయుడును సన్మానిస్తున్న ఆర్ఎంపిలు

సామాజిక కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకికి చెందిన సామాజిక కార్యకర్త ఈర్ల సంజీవనాయుడును విజయనగరంలో మంగళవారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వైద్యులు మంగళవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య సంఘం అధ్యక్షులు జోషి మాట్లాడుతూ పెదపెంకిలో చుట్టుపక్కల గ్రామాల్లో సంజీవనాయుడు సామాజిక సేవాకర్తగా మంచి పేరు సంపాదించుకున్నారని, పేదల పట్ల శ్రద్ధ నిలిపి వారికి అన్ని విధాలా ఆదుకుంటూ కొన్ని వందల కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కొన్ని పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొని సహకరిస్తూ ఉండేవారని అన్నారు ఇందుకుగానూ ఉత్తమ సమాజ సేవాకర్తగా సంజీవనాయుడును వారు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, తిరుమల రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్వేత

ఎంపిడిఒగా శ్వేత బాధ్యతల స్వీకరణ


ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా దండ శ్వేత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్చార్జి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన వై.వెంకటరమణ ఎఒగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్వేత మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం సిబ్బంది పరిచయం చేసుకున్నారు.

నిరుపేదకు సిమెంట్ బస్తాలు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడకు చెందిన గొడబ లక్ష్మమ్మ అనే వృద్ధురాలి ఇంటి నిర్మాణానికి పెదపెంకికి చెందిన నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో టిపిఆర్ పట్నాయక్ ఐదు సిమెంట్ బస్తాలకు సరిపోయేలా ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఎంతో కొంత ఆర్థికసాయం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతులతో వెదజల్లుతున్న టిబి చర్చి

విద్యుత్ అలంకరణలో చర్చిలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని టిబి చర్చి, ఆర్‌సిఎం దేవాలయాలతో పాటు తూడి, తలవరం, వండువ, చిట్టిపూడివలస, కంబర, చలివేంద్రి, బిటివాడ, తదితర గ్రామాల్లో దేవాలయాలు విద్యుత్తు అలంకరణలతో దర్శనమిస్తున్నాయి. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రతిరోజు క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

21న మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ గ్రామ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈనెల 21న మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కంటి వ్యాధితో బాధపడుతున్న రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ, బ్యాంకు ఖాతా పుస్తకం ఏ విధమైన గుర్తింపులున్నా తమ వెంట తీసుకురావాలని సూచించారు.



గరుగుబిల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎస్ఎస్ఎ ఉద్యోగులకు జిటిఎ మద్దతు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సమగ్ర శిక్షణలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చేస్తున్న సమ్మెకు రోజురోజుకు ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి మద్దతు పెరుగుతుంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఉపాధ్యాయల సంఘం మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా అధ్యక్షులు కెవి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిఎస్‌కె సంజీవి, కోశాధికారి మూటక భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు ఎమ్మార్సీ కార్యాలయానికి వెళ్లి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించి నెలల తరబడి చెల్లించాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

గరుగుబిల్లి: సమగ్రశిక్ష ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16 నుంచి చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మేరకు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనం ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగులు బోను రామకృష్ణ, రేగిడి రాంబాబు, రమణమ్మ, వాకాడ శారద, తదితరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగు జీతాలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రస్తుతం పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల20లోగా సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు యడ్ల యశోద, ఎం.శంకరరావు, ఐసిఆర్‌టి యర్రా వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

తీసేశారు... వదిలేశారు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో ఈనెల 5,6,7 తేదీల్లో తుపాను కారణంగా పలు ప్రాంతాలు వరదనీటిలో ముంపునకు గురయ్యే అవకాశం ఉందని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ అధ్వర్యంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు, పలు వార్డుల సచివాలయాల కార్యదర్శులు వరహాల గెడ్డ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవ్వకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మున్సిపల్ ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న పలకలను తొలగించి లక్షలాది రూపాయల నిధులు ఖర్చుచేసి కాలువలను శుభ్రపరిచారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ కాలువలపై ఉన్న పలకలను తొలగించి 15 రోజులు కావస్తున్నా వాటిని కాలువలపై అమర్చేకుండా రహదారిపైనే వదలి వేశారు. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారులతో పాటు, ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు కాలువలపై తీసిన పలకలను అమర్చకపోవడమేమిటని, వీటి వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే దీనికి బాధ్యులు ఎవరిని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కాలువలపై అక్కడిక్కడ తీసిన పలకలను కాలువలపై అమర్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువ తొలగించిన పలక



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి లక్ష్మణరావు

పశు వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొండవాడ పంచాయతీ గిరిశిఖర గ్రామం ఒప్పంగిలో పశుసంవర్ధక శాఖ, పశువిజ్ఞాన బడిలో భాగంగా పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి రైతులు తీసుకొచ్చిన మూగజీవాలను పరీక్షించి ఉచితంగా మందులను సర్పంచ్ మీనక కృష్ణారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ శీతాకాలంలో మూగజీవులైన పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గొర్రెలు, మేకలకు సంబంధించి చీడపారుడు వ్యాధికి సంబంధించి వ్యాధి నిరోధక టీకాలు చేయడం జరిగింది. అలాగే ఏమైనా పశువులు అనారోగ్యానికి గురైనట్లయితే సచివాలయం పరిధిలో గల పశుసంవర్ధక సహాయకుల ద్వారా డాక్టర్లకు తెలపాలన్నారు. ఈ శీతాకాలంలో ఆవులకు, గేదెలు, మేకలకు, గొర్రెలకు ఎక్కువగా ఊపిరితిత్తుల వ్యాధి న్యూమోనియా వంటిది వాతావరణ ప్రభావం కారణంగా సంక్రమిస్తాయన్నారు. కావున పశుపోషకులు పశువులను పాకల్లో రాత్రి సమయంలో కట్టుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. పశువైద్య శిబిరంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు పి.క్రాంతి రమాదేవి, జి.నళిని, పశుసంవర్ధక శాఖ సహాయకులు ఎన్.శరత్‌కుమార్, ఎ.పవన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు వండి పెట్టలేం

డిఇఒకు తెలిపిన ఎండిఎం కార్మికులు

విజయనగరం టౌన్ : అంగన్వాడీ కేంద్రాలు పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వంటలు చేసి పెట్టాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారని, తాము అంగన్వాడీల పోరాటానికి మద్దతు ఇస్తున్నందున వంటలు చేసి పెట్టలేమని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు డిఇఒ బి.లింగేశ్వర రెడ్డికి తెలిపారు. మంగళవారం డిఇఒకు ఆ సంఘం నాయకులు బి.సుధారాణి, రామలక్ష్మి, సత్యవతి వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి అంగన్వాడీ పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో స్కూల్లో వంట చేయాలని అధికారులు చెప్పారని, అయితే తామంతా అంగన్‌వాడీల సమ్మెకు మద్దతిస్తున్నామని తెలిపారు. అందువల్ల తాము పిల్లలకు వండి పెట్టలేమి తేల్చి చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ప్రధాన సమస్యలైనా తాగునీరు, డంపింగ్ యార్డ్ సమస్యలు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది అంతా కలిసి తోటపల్లి ప్రాంతం పరిధిలో గల పంప్‌హౌస్‌ను క్షేత్రస్థాయిలో పట్టణానికి తాగునీరు అందజేసే అతి ప్రధానమైన పంప్ హౌస్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టణ ప్రధాన సమస్యలు తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారానికి శాశ్వతంగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే మంచి నీటి సరఫరాకు రూ.63.33 కోట్లు నిధులు మంజూరు చేయగా రూ.3 కోట్లు వరకు పనులు జరిగాయని, మిగిలిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పారు. దీనితో పాటు డంపింగ్ యార్డు ప్రధాన సమస్యకు కూడా త్వరలోనే జిల్లా అధికారుల సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ రెండు సమస్యలను వచ్చే ఎన్నికల్లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తోటపల్లి మంచి నీరు పంపు హౌస్ ప్రాంతంలో గల స్థలాన్ని అంతటినీ కంచే వేసి అవసరమైన చోట మొక్కలు నాటడం, అలాగే అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం తోటలో అందరితో కలిసి ఎమ్మెల్యే వనభోజనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీ శ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పంప్‌హౌస్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

యువగళం ముగింపు సభకు తరలిరండి

ప్రజాశక్తి - సీతంపేట

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో బుధవారం నిర్వహించనున్న యువగళం నవశకం సభకు పాలకొండ నియోజకవర్గం నుంచి యువకులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని టిడిపి నాయకులు పడాల భూదేవి పిలుపునిచ్చారు. రానున్నది టిడిపి ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

షార్టు సర్క్యూట్‌తో బ్యాటరీ స్కూటీ దగ్ధం

ప్రజాశక్తి - సీతంపేట

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అల్లూరి సీతారామరాజు వీధికి చెందిన పెద్దింటి అప్పలనాయుడు బ్యాటరీ స్కూటీ ఛార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు రేగి స్కూటీ మొత్తం దగ్ధమై బూడిదయ్యింది. దీంతో అప్పలనాయుడు కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



శస్త్రచికిత్సలకు రోగులను తరలిస్తున్న వైద్యులు

నేత్ర శస్త్ర చికిత్సలకు 16 మంది ఎంపిక

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలకు మండలం నుంచి 16 మంది రోగులను పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో కంటి వెలుగు వైద్య శిబిరాలు, నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్(అంతర కుసుమం), టెరిజియం(కొయ్యకండ) ఉన్న 16 మందిని ఎంపిక చేసి కంటి ఆపరేషన్లకు పంపించినట్లు చెప్పారు. ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలకు వెళ్తున్న రోగులకు పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తమ లాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యతగా తీసుకొని తమకు దగ్గరుండి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు శైలజ, చామంతి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగుల వల్ల నష్టపోయిన పంటలకు రైతులకు పరిహారం చెల్లించి వాటిని శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించాలని టిడిపి అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. మంగళవారం గల్లికోటలో ఏనుగులు దాడిలో నష్టపోయిన పంట పొలాలను టిడిపి నాయకుల బృందం పరిశీలించింది. సోమవారం కళ్లికోటలో రాత్రివేళ ఏనుగుల గుంపు, జొన్న, టమాటో, వరి పంటలను సుమారుగా 10 ఎకరాల పంటను ఎందుకూ పనికిరాకుండా చేశాయని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట నాయుడు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగాఏనుగులు తిష్ట వేసి ఈ ప్రాంతంలోని పంటలను నాశనం చేస్తున్నా కనీసం పాలకులకు పట్టకపోవడం దురదృష్టకరమన్నారు. వందల ఎకరాల్లో ఏనుగుల బారినపడి పంటలు నష్టపోతున్నా పూర్తిస్థాయిలో రైతులకు పరిహారం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా కలికోట, దుగ్గి, గుణానపురం, అర్తాం తదితర ప్రాంతాల్లో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదనరావు, నాయకులు పి.హరిప్రసాద్, మండల తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను, కళ్లికోట గ్రామ పంచాయతీకి చెందిన మండల బిసి సెల్ అధ్యక్షులు కిశోర్, బూత్ కన్వీనర్ మురళి, పాకలపాటి నూకరాజు పలువురు రైతులు హాజరైనారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంటను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్రంలో జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అద్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ రేజేటి విస్సు, కౌన్సిలర్ ఒమ్మి లక్ష్మి, ఒమ్మి రామారావు, పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని రావువారివీధి, శివాలయం, పల్లివీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, పారిశుధ్య విభాగ సిబ్బంది ఉన్నారు.


హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

తల్లీ కుమారుడు మృతి

తండ్రికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి





హైదరాబాద్ సంగారెడ్డిలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలి మండలం దిబ్బగుడివలస గ్రామానికి చెందిన తల్లీ కుమారుడు దుర్మరణం చెందగా తండ్రి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. దిబ్బగుడివలసకు చెందిన కొట్నాన సత్యనారాయణ, భార్య మహితో కలిసి జీవనం సాగిస్తున్నారు. సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ముగ్గురు కలిసి మంగళవారం ఉదయం ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సంగారెడ్డి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో తల్లి మహి, కుమారుడు దేవాన్ష్ అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గాయపడిన సత్యనారాయణను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా మరణించిన మహి, దేవాన్స్ మతదేహాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి అంత్యక్రియలు కోసం స్వగ్రామం దిబ్బగుడివలస తీసుకువస్తున్నారు. తల్లీ కుమారుడు మతితో దిబ్బగుడివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి.